www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 31 జనవరి 2023
5
ఏలూరు

అంగన్‌వాడీల వేతనం రూ.26వేలకు పెంచాలి

ఏలూరు:అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు పెరిగిన ధరలకు అనుగుణంగా నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డివిఎస్‌ఎస్‌.ప్రసాద్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో యూనియన్‌ జిల్లా ఉపాధ్యక్షులు పిఎల్‌ఎస్‌.కుమారి అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రసాద్‌ మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని డిమాండ్‌ చేశారు. వారిపై వేధింపులు అన్యాయమన్నారు. వారికి ఫేస్‌ హాజరు యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. వైఎస్‌ఆర్‌ సంపూర్ణ పోషణ పేరుతో అంగన్‌వాడీలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. యూనియన్‌ జిల్లా కార్యదర్శి పి.భారతి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు బిల్లుల బకాయిలు చెల్లించాలని డిమాండ్‌ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వారికి గ్రాట్యుటీ ఇవ్వాలని రూ.ఐదు లక్షల రిటైర్మెంట్‌ బెనిఫిట్‌ కల్పించాలని డిమాండ్‌ చేశారు. ఈ సమావేశంలో యూనియన్‌ జిల్లా నాయకులు కె.విజయలక్ష్మి, పి.హైమావతి, విమల, సరోజిని, మాణిక్యం, రూప్సీ, రాజకుమారి, వెంకటలక్ష్మి రమాదేవి పాల్గొన్నారు.

రైల్వే లైన్లు పట్టాలెక్కేనా..!

రూటు మారిన కొవ్వూరు-భద్రాచలం లైన్
సత్తుపల్లి-కొవ్వూరు లైన్‌కు కొత్త ప్రతిపాదన
కొత్త ప్రతిపాదనలకైనా నిధులొచ్చేనా
కదలిక లేని కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్‌ పనులు
ఈ బడ్జెట్‌లోనైనా నిధుల కేటాయింపు జరిగేనా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి జిల్లావాసుల్లో దశాబ్దాలుగా కలగా ఉన్న రైల్వేలైన్లకు ఈ ఏడాదైనా కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరిగేనా అనే చర్చ జిల్లావాసుల్లో నడుస్తోంది. ఫిబ్రవరి ఒకటో తేదీన కేంద్ర ప్రభుత్వం 2023-24కు సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. దీంతో జిల్లాకు సంబంధించిన రైల్వేలైన్లకు నిధుల కేటాయింపు చేస్తారా లేక ప్రతియేటా మాదిరిగా ఊసేలేకుండా పోతుందనే చర్చ మళ్లీ మొదలైంది. కొవ్వూరు-భద్రాచలం రైల్వేలైన్‌ నిర్మాణం జిల్లావాసులకు నాలుగున్నర దశాబ్దాల కల. ఖమ్మం, పశ్చిమ ఏజెన్సీలో ప్రయాణ సౌకర్యాన్ని, వివిధ ఉత్పత్తులను తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం తీసుకువెళ్లడంతో రవాణా సౌకర్యాన్ని కల్పించే రైలు మార్గం ఇది. 1965 నుంచి ఈ రైల్వే లైన్‌ నిర్మించాలనే డిమాండ్‌ ఉంది. ఉమ్మడి జిల్లాలో కొవ్వూరు, పంగిడి, దేవరపల్లి, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, అశ్వారావుపేట, దాయవరం మీదుగా 155.6 కిలోమీటర్ల మేర రైల్వేలైన్‌ నిర్మించి మార్గమధ్యంలో 16 స్టేషన్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ లైన్‌ నిర్మాణం జరిగితే కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్‌ నుంచి బొగ్గును నేరుగా రైల్వే ద్వారా విశాఖ, హైదరాబాద్‌కు పంపడానికి వీలుంటుంది. ఈ రైల్వేలైన్‌కు సంబంధించిన ఖర్చులో 50 శాతం వాటా రాష్ట్రం భరించాల్సి ఉంటుంది. 2014లో రాష్ట్ర విభజన జరగడం, మోడీ సర్కార్‌ అధికారంలోకి రావడంతో ఈ రైల్వేలైన్‌ను పూర్తిగా పక్కన పెట్టేసింది. కేంద్రం బడ్జెట్‌ ప్రవేశపెట్టిన ప్రతిసారీ జిల్లావాసులు ఈ రైల్వేలైన్‌కు నిధులు కేటాయింపుస్తుందని ఆశపడి భంగపడటం పరిపాటిగా మారింది. అయితే కొవ్వూరు-భద్రాచలం లైన్‌ను పూర్తిగా పక్కన పెట్టేసి దానికి బదులు కొత్త ప్రతిపాదనలను రైల్వేశాఖ తెరపైకి తెచ్చినట్లు తెలిసింది.

కొత్త రైల్వేలైన్‌ ప్రతిపాదనలు ఇలా..

కొవ్వూరు-భద్రాచలం రైల్వే లైన్‌ అలైన్‌మెంట్‌లో మార్పులు చేసి సత్తుపల్లి మీదుగా రైల్వేలైన్‌ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది. ఇలా చేస్తే భద్రాచలం నుంచి సత్తుపల్లి వరకూ భూసేకరణకు సంబంధించిన నిధుల తామే సమకూరుస్తామని సింగరేణి కాలరీస్‌ ముందుకొచ్చినట్లు చెబుతున్నారు. ఈ మార్గం నిర్మాణానికి అయ్యే మొత్తం వ్యయంలో దాదాపు రూ.607 కోట్లు భరించేందుకు సింగరేణి కాలరీస్‌ సిద్ధపడినట్లు సమాచారం. దీంతో కొవ్వూరు-భద్రాచలం రైల్వేలైన్‌ను పక్కన పెట్టేసినట్లు చెబుతున్నారు. కొత్తగా ప్రతిపాదించిన రైల్వేమార్గం 118 కిలోమీటర్లుగా తేల్చారు. దీనిలో తెలంగాణలో 48.9 కిలోమీటర్లు, ఎపిలో 70 కిలోమీటర్లు ఉంది. ఈ రైల్వేలైన్‌కు మొత్తం రూ.మూడు వేల కోట్లు ఖర్చు కానున్నట్లు ప్రతిపాదనలు సైతం తయారైనట్లు సమాచారం. ఈ రైల్వేలైన్‌కు కూడా తెలంగాణ, ఎపి కొంత వాటా చెల్లించాలని నిర్ణయించినట్లు తెలిసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రాలేదని సమాచారం. దీంతో కేంద్రమే పూర్తిస్థాయి ఖర్చును భరించేలా మరో ప్రతిపాదన తయారు చేసినట్లు చెబుతున్నారు. కేంద్రం చేపడుతున్న సాగరమాల ప్రాజెక్టులో ఈ రైల్వేలైన్‌ చేర్చాలని చూస్తున్నట్లు సమాచారం. దీనికి కేంద్రం సిద్ధపడుతుందా లేదా అనేది ఈ బడ్జెట్‌లో తేలనున్నట్లు చెప్పుకొస్తున్నారు. ప్రస్తుతం నిర్మితమవుతున్న గ్రీన్‌ఫీల్డ్‌ హైవేకు సమాంతరంగా ఈ రైల్వేలైన్‌ నిర్మాణం జరిగేవిధంగా ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది. ఒకవేళ కొవ్వూరు-సత్తుపల్లి రైల్వేలైన్‌గా మార్పు చేస్తే.. కొత్త ప్రతిపాదనలకైనా బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరిగేనా అనేది వేచిచూడాలి.

కోటిపల్లి - నరసాపురం రైల్వేలైన్‌కు మోక్షం కలిగేనా

ఉమ్మడి జిల్లాలో మరోముఖ్యమైన రైల్వే మార్గం కోటిపల్లి-నరసాపురం. ఈ రైల్వేలైన్‌ను 2000-2001లో ప్రతిపాదించారు. లోక్‌సభ స్పీకర్‌ బాలయోగి హయాంలో ఇది తెరపైకి వచ్చింది. మొత్తం 57 కిలోమీటర్ల పొడవునా ఈ రైల్వే లైన్‌ నిర్మాణం జరగాల్సి ఉంది. మొత్తం రూ.2,120 కోట్లు అంచనాతో ఈ రైల్వేలైన్‌ ప్రతిపాదనలు సిద్ధమైనప్పటికీ ప్రస్తుత పరిస్థితులతో అంచనా వ్యయం ఇంకా పెరిగే అవకాశం ఉంది. గోదావరిపై మూడుచోట్ల బ్రిడ్జిలు నిర్మాణం జరగాల్సి ఉంది. ఇప్పటి వరకూ ఈ రైల్వేలైన్‌ ఒక్క అడుగు కూడా ముందుకు పడని పరిస్థితి లేకుండాపోయింది. నిధుల కేటాయింపునకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నెపం మోపుకుంటూ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న పరిస్థితి నెలకొంది. ఈ రైల్వేలైన్‌కు సంబంధించి 50 శాతం ఖర్చు రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంది. ఈ రైల్వేలైన్‌ నిర్మాణం జరిగితే విజయవాడ నుంచి విశాఖ రైల్వేలైన్‌ మాదిరిగా మరో రైల్వేలైన్‌ ఏర్పాటవుతోంది. వ్యవసాయ, ఆక్వా ఉత్పత్తుల రవాణా మరింత తేలికవుతుంది. ఈ బడ్జెట్‌లోనైనా కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్‌కు మోక్షం కలిగేనా అనే చర్చ జిల్లావాసుల్లో నడుస్తోంది.

ఏలూరులో..

జిఒ1 రద్దు చేయాల్సిందే

నూజివీడులో..

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే జిఒ 1ని రద్దు చేయాలని అఖిలపక్షం డిమాండ్‌ చేసింది. సోమవారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక గాంధీ మైదానంలో అఖిలపక్ష నాయకులు జిఒ1పై నిరసన తెలుపుతూ నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పళ్లెం కిషోర్‌, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్‌, సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సిపిఐఎంఎల్‌ న్యూ డెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు, జనసేన ఏలూరు నియోజకవర్గ కన్వీనర్‌ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ముఖ్యమంత్రి జగన్‌ నియంత మాదిరిగా జిఒ1ని తీసుకువచ్చారని విమర్శించారు. రాజ్యాంగంలో భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రతి పౌరునికి కల్పిస్తే వైసిపి ప్రభుత్వం వాటిని హరిస్తూ పౌర హక్కులను కాలరాస్తుందన్నారు. జగన్‌ నియంతృత్వ పాలనకు ఈ జిఒ నిదర్శనమన్నారు. ప్రజా ఉద్యమాలను అణచేందుకు వైసిపి ప్రభుత్వం అక్రమంగా జిఒలు విడుదల చేసిందన్నారు. బ్రిటిష్‌ కాలం నాటి చట్టాలను తీసుకువచ్చి ప్రతిపక్షాల ఉద్యమాలను అణిచివేసేందుకు ముఖ్యమంత్రి జగన్‌ దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారన్నారు. గాంధీ విగ్రహానికి నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బండి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి హేమ శంకర్‌, సిపిఎం నాయకులు డిఎన్‌విడి.ప్రసాద్‌, బి.సోమయ్య, కె.శ్రీనివాస్‌, జగన్నాథరావు, వైఎస్‌.కనకారావు, ఏసుబాబు, కోటేశ్వరరావు, సిపిఐ ఎంఎల్‌ న్యూడెమోక్రసీ నాయకులు బద్దావెంకట్రావు, కాకర్ల అప్పారావు, ఎర్ర శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకులు ఇళ్ల శ్రీనివాస్‌, కస్తూరి తేజస్విని, కాశీ నరేష్‌, గుబ్బల నాగేశ్వరరావు, అఖిలపక్ష నాయకులు ఎస్‌.సాయిబాబా, వరప్రసాద్‌, గేదెల నాగేశ్వరరావు, విజయ, అడ్డగర్ల లక్ష్మీ ఇందిర, పోలా భాస్కర్‌, శ్రీను, అల్లు సాయిచరణ్‌, పైడి లక్ష్మణరావు, బొండా రాము, వీరి నాయుడు, రాము, రమణ, భూపతి రాఘవ, కొండ శివ, బ్రహ్మం, నరసింహమూర్తి, కోటేశ్వరరావు, నూకరాజు, కోరాడ అప్పారావు, క్రాంతి, సుజాత, ప్రమీళ, సరళ, సుజాత, ఉమాదుర్గ పాల్గొన్నారు.

నూజివీడు : జిఒ1ని రద్దు చేయాలని కోరుతూ స్థానిక చిన్నగాంధీ బొమ్మ సెంటర్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నోటికి నల్ల రిబ్బన్లు ధరించి సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ప్రజాసమస్యలపై గళమెత్తే అవకాశం లేకుండా నియంతృత్వ ధోరణితో వైసిపి ఇటీవల తెచ్చిన జిఒ1ని రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. కనీస ఆలోచన చేయకుండా బ్రిటిష్‌ కాలంలో అమలు చేసిన జిఒను వైసిపి ప్రభుత్వం అమలుపరచడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నరసింహ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, సిఐటియు నాయకులు రాజు, దుర్గారావు, పాపారావు, సత్తు కోటేశ్వరరావు, ఐద్వా నాయకురాలు పద్మాంజలి, హోలీమేరీ పాల్గొన్నారు.

టి.నరసాపురం : జిఒ 1ని రద్దు చేయాలని కోరుతూ టి.నరసాపురంలోని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి సందర్భంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జిఒ నెంబర్‌ ఒకటి రద్దు చేయాలని కోరుతూ నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన ప్రదర్శన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ జిఒపై అన్ని ప్రజాసంఘాలు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు తుమ్మల సత్యనారాయణ, మడకం సుధారాణి, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు అనుములు మురళీ పాల్గొన్నారు.

గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్‌

ప్రపంచానికి గాంధీ ఆదర్శం : కలెక్టర్‌

ప్రజాశక్తి - ఏలూరు

అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్య్రం సాధించి ప్రపంచానికే గాంధీ ఆదర్శంగా నిలిచారని కలెక్టర్‌ ప్రసన్న వెంకటేష్‌ అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌ గోదావరి సమావేశ మందిరంలో గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ చిత్రపటానికి కలెక్టర్‌ ప్రసన్నవెంకటేష్‌ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతిసమగ్రత, సమైఖ్యతలను పరిరక్షించేందుకు గాంధీ అనుసరించిన శాంతియుత మార్గం అందరికీ ఆదర్శనీయమన్నారు. గాంధీ జీవితాన్ని ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెసి పి.అరుణ్‌ బాబు, ఆర్‌డిఒ కె.పెంచల కిషోర్‌, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్‌

ఓటింగ్‌ యంత్రాల గోదాము పరిశీలన

ప్రజాశక్తి - ఏలూరు

ఎలక్ట్రానిక్‌ ఓటింగ్‌ మెషీన్ల (ఇవిఎం) భద్రతపై ఏలూరు కలెక్టరేట్‌ వద్ద ఉన్న ఇవిఎం, వివిప్యాట్‌ గోదామును సోమవారం కలెక్టర్‌ ప్రసన్న వెంకటేష్‌ పరిశీలించారు. వాటి రక్షణ, భద్రతను తనిఖీ చేశారు. వివి ప్యాట్‌ గోదాముకు వేసిన సీళ్ల భద్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఇవిఎం, వివి ప్యాట్‌ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి, సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు కలెక్టర్‌ వెల్లడించారు. వీరివెంట కలెక్టరేట్‌ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్‌ టిఎల్‌ఎస్‌ఎస్‌.ప్రసాద్‌, సిబ్బంది కె.లక్ష్మీనారాయణ ఉన్నారు.

మాట్లాడుతున్న టి.సుధాకర్‌

కార్పొరేట్లే మోడీకి ముఖ్యం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

కార్పొరేట్‌ సంస్థల లబ్ధి కోసం ప్రజలను మతాల పేరుతో విభజిస్తూ ఫాసిస్ట్‌ పాలన తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని సిపిఐ ఎంఎల్‌ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.సుధాకర్‌ విమర్శించారు. అమరులైన సిపిఐ ఎంఎల్‌ సీనియర్‌ నాయకులు సత్యనారాయణసింగ్‌ శత జయంతి సందర్భంగా సోమవారం స్థానిక ధర్మన్న స్మారక భవనంలో బహిరంగసభ నిర్వహించారు. సిపిఐ ఎంఎల్‌ న్యూడెమోక్రసీ సీనియర్‌ నాయకులు ధర్మల సురేష్‌ అధ్యక్షతన జరిగిన సభలో టి.సుధాకర్‌ మాట్లాడుతూ పీడిత ప్రజల విముక్తి కోసం సత్యనారాయణ సింగ్‌ పోరాడారన్నారు. ఈ సభలో ఎఐకెఎంఎస్‌ జిల్లా అధ్యక్షులు వెట్టి సుబ్బన్న, అరుణోదయ నాయకులు శ్రీనివాస్‌ ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కెవి.రమణ, సిపిఐ ఎంఎల్‌ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కారం రాఘవ పిడిఎస్‌యు నాయకులు పాల్గొన్నారు.

15,968 మందికి జగనన్న చేదోడు లబ్ధి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో జగనన్న చేదోడు పథకంలో వరుసగా మూడో ఏడాది 15,968 మంది రజక, నాయీబ్రాహ్మణ, దర్జీలకు రూ.15.96 కోట్ల ఆర్థిక లబ్ధి చేకూరిందని కలెక్టర్‌ ప్రసన్న వెంకటేష్‌ చెప్పారు. ఈ ఆర్థికసాయాన్ని సిఎం జగన్‌ పల్నాడు జిల్లా వినుకొండ వేదికగా కంప్యూటర్‌ బటన్‌ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశారు. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్‌, కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు, బిసి కార్పోరేషన్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ పుష్పలత, ఉమ్మడి జిల్లా రజక సంఘం అధ్యక్షులు, రాష్ట్ర జనరల్‌ సెక్రటరీ సిహెచ్‌.కట్లయ్య పాల్గొన్నారు. దూలం నాగేశ్వరరావుతో జిల్లా కలెక్టర్‌ ఏలూరు జిల్లాకు చెందిన 15,968 మంది లబ్ధిదారులకు రూ.15.97 కోట్ల రూపాయల మేగా చెక్కును అందజేశారు. అనంతరం కలెక్టర్‌ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న చేదోడులో షాపులున్న రజకులు, నాయీ బ్రాహ్మణులు, దర్జీలకు ఏటా ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది దుకాణాలున్న 9,420 మంది టైలర్లకు రూ.9.42 కోట్లు, 4,419 మంది రజకులకు రూ.4.42 కోట్లు, 2,129 మంది నాయీబ్రాహ్మణులకు రూ.2.13 కోట్ల లబ్ధి చేకూరినట్లు తెలిపారు. దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న చేదోడు ద్వారా రజకులకు, నాయి బ్రాహ్మణులకు, దర్జీలకు ఆర్థిక సహాయాన్ని అందిస్తూ వారికి అండగా నిలుస్తుందన్నారు. నవరత్నాల ద్వారా పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తున్న సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు.


లబ్ధిదారులకు డెమో చెక్కును అందిస్తున్న కలెక్టర్‌ ప్రసన్నవెంకటేష్‌

పౌష్టికాహార పంపిణీలో అలసత్వం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - ఏలూరు

అంగన్వాడీ కేంద్రాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం నిర్ధేశించిన విధంగా పౌష్టికాహారం పంపిణీ జరగాలని ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి, ఆర్‌బిఎస్‌కె కో ఆర్డినేటర్‌ డాక్టర్‌ సిహెచ్‌.మానస సంబంధిత అధికారులను ఆదేశించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో సోమవారం సుడిగాలి పర్యటన చేసి అంగన్వాడీకేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, పిహెచ్‌సిలను మానస సందర్శించి పౌష్టికాహారం పంపిణీ, ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలగొంది అంగన్వాడీ కేంద్రంలో కోడిగుడ్లు పంపిణీ చేసినట్లు రికార్డుల్లో ఉంది కానీ, గుడ్ల నిల్వలు ఉండటంపై సిబ్బందిని ప్రశ్నించారు. మహిళలు, గర్భిణులు, పిల్లల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపం లేకుండా ఉండేందుకు ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందిస్తుందని, దాన్ని నిర్దేశించిన వారికి అందేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రసూగొంది అంగన్వాడీ కేంద్రంలో కేవలం మూడు కోడిగుడ్లు పంపిణీ చేయడంపై సిబ్బందిని ప్రశ్నించారు. ఆ ప్రాంతంలోని గిరిజనులు పునరావాస కాలనీలకు వెళ్లారని, వారికి అక్కడ అంగన్వాడీకేంద్రంలో అందిస్తున్నారని సిబ్బంది తెలిపారు. దీనిపై మానస స్పందిస్తూ పునరావాస కాలనీల వారికి పౌష్టికాహారం అందుతున్నదీ, లేనిదీ పరిశీలించాలన్నారు. అంగన్వాడీ పరిధిలోని మహిళలు, గర్భిణులు, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి రక్తహీనత కలిగిన వారికి తగిన చికిత్స అందించడంతోపాటు పౌష్టికాహారం అందేలా అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కోయిదా, కొత్తూరు, గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రం, ఎంపిపి పాఠశాల, బోళ్లపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పంపిణీని పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని వికలాంగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆ ప్రాంతంలోని ప్రజలకు వస్త్రాలను అందించారు. అనంతరం కొయిదా పిహెచ్‌సిలో మహిళలకు శానిటరీ నాప్కిన్స్‌ను పంపిణీ చేశారు.

విలీన మండలాల్లో 8 నుండి కేంద్రం బృందం పర్యటన

13 నుండి 19 మధ్య వయస్సు కలిగిన బాలికల్లో శారీరక పరిశుభ్రత అంశంపై పాన్‌ ఇండియా స్టడీ నిమిత్తం కేంద్ర బృందం ఫిబ్రవరి, 8, 9, 10 తేదీల్లో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, బాలికల వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలు, పిహెచ్‌సిలు సందర్శిస్తారని మానస చెప్పారు. కౌమార వయస్సు బాలికల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తారన్నారు.

గిరిజనులకు హక్కులివ్వండి

సాగు భూములపై యాజమాన్య హక్కుల కోసం కదంతొక్కిన గిరిజనం
ఏజెన్సీ గిరిజన సంఘం రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ వద్ద ఆందోళన
గిరిజనుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి: మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం మండలంలో గిరిజనుల సాగులో ఉన్న భూములకు యాజమాన్య హక్కులు కల్పించడంతోపాటు పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని ఏజెన్సీ గిరిజన సంఘం, రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో వందలాది మంది గిరిజనులు ఏలూరు జిల్లా కలెక్టరేట్‌ వద్ద సోమవరం పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. పోలవరం మండలంలోని ఏజెన్సీ ప్రాంతం నుంచి తరలొచ్చిన వేలాది మంది గిరిజనులు ముందుగా ఏలూరు జ్యూట్‌ మిల్లు నుంచి ప్రదర్శనగా బయలుదేరి 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న తమ భూములకు హక్కులు కల్పించాలంటూ నినదిస్తూ ప్రదర్శన కొనసాగించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌ వద్ద ఆందోళనలో మాజీ వ్యవసాయ శాఖ మంత్రి, రైతుసంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్‌ వడ్డే శోభనాదీశ్వరరావు మాట్లాడారు. గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములకు సంబంధించి ప్రభుత్వం చేపడుతున్న సర్వేలో నిర్ధారించి పట్టాలు ఇవ్వడంతోపాటు, రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఇవ్వాల్సినవన్నీ ఇచ్చి గ్రామాలను ఖాళీ చేయించాలని తెలిపారు. కాపర్‌ డ్యాం కట్టడంతో గత్యంతరం లేక గిరిజనులు గ్రామాలను ఖాళీ చేసి వెళ్లారన్నారు. ప్రభుత్వం న్యాయం చేయకపోతే న్యాయ స్థానాలను ఆశ్రయించి న్యాయం పొందేందుకు సైతం గిరిజనులు సిద్ధంగా ఉన్నారన్నారు. రైతు కూలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ పోలవరం మండలంలో గిరిజనులు 30 ఏళ్లుగా పోరాటం చేస్తున్న భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలని డిమాండ్‌ చేశారు. మాజీ జమీందారుకు ఉన్న భూములపై 2002లో జరిగిన చర్చల్లో ఆ భూములు వివాదాస్పద భూములని పిఒ అధ్యక్షతన ఏర్పడిన కమిటీ ధ్రువీకరించిందన్నారు. నాటి నుండి నేటి వరకు గిరిజనుల సాగు నమోదు చేయడం లేదని, హక్కులు కల్పించడం లేదని విమర్శించారు. ఈ ధర్నాకు రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్‌ భాషా అధ్యక్షత వహించారు. సంఘీభావంగా అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షులు జై వెంకటేశ్వర్లు, రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి డి వర్మ, గుంటూరు జిల్లా కార్యదర్శి ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు వేట్ల విజయబీ, గిరిజన సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కుంజం రామారావు, జిల్లా నాయకులు సవలం రాంబాబు మాట్లాడారు. అనంతరం జిల్లా జాయింట్‌ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన ఐటిడిఎ పిఒచే విచారణ చేయిస్తామన్నారు. ధర్నా అనంతరం డప్పు నత్యాలతో కలెక్టరేట్‌ నుండి జ్యూట్‌మిల్లు వరకు మరోసారి ప్రదర్శన నిర్వహించారు. ప్రజాకళాకారులు పాడిన పాటలు ఉత్తేజాన్ని కల్గించాయి.


ధర్నాలో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

సమరయాత్రను విజయవంతం చేయాలి

నేడు ఏలూరు రాక - కలెక్టరేట్‌ వద్ద సభ

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు కృషి చేయాలని డిమాండ్‌ చేస్తూ విద్యార్థి, యువజన సంఘాలు, ప్రత్యేక హోదా సాధన సమితి చేపట్టిన రాష్ట్ర సమర యాత్రకు ప్రజలంతా మద్దతు పలకాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. సోమవారం సాయంత్రం సిపిఎం కార్యాలయంలో సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పళ్లెం కిషోర్‌ అధ్యక్షతన వామపక్షాలు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సిపిఐఎంఎల్‌ న్యూ డెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి బిజెపి మోసగించిందన్నారు. అధికారంలో ఉన్న వైసిపిగానీ, టిడిపి, జనసేన పార్టీలు హోదా విషయంలో నోరు మెదపడం లేదని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో వామపక్షాలు మాత్రమే కేంద్రంపై పోరాడుతున్నాయన్నారు. ఈ సమయంలో రాష్ట్రంలో విద్యార్థి, యువజన సంఘాలు, ప్రత్యేక హోదా సాధన సమితి చేపట్టిన సమర యాత్ర 31వ తేదీ ఉదయం ఏలూరు వస్తుందన్నారు. ఈ యాత్రకు ప్రజలంతా మద్దతు పలకాలన్నారు. ఉదయం 10 గంటలకు ఏలూరు కలెక్టరేట్‌ వద్ద జరిగే సభలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.సోమయ్య, సిపిఐ నాయకులు బండి వెంకటేశ్వరరావు, నగర సమితి కార్యదర్శి యు.హేమశంకర్‌, న్యూ డెమోక్రసీ నాయకులు బద్దా వెంకట్రావు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో ఆపదమిత్రలు

12 రోజుల శిక్షణ పూర్తి - సర్టిఫికెట్లు అందించిన కలెక్టర్‌


ఆపదమిత్ర వాలంటీర్లకు సర్టిఫికెట్లు అందిస్తున్న కలెక్టర్‌

ప్రజాశక్తి - ఏలూరు

విపత్తుల సమయంలో తీసుకునే జాగ్రత్తలు, అవగాహన కార్యక్రమాలపై ఇచ్చిన శిక్షణలో ఆపదమిత్ర వాలంటీర్లు వాటిని ఆకళింపు చేసుకుని సమాజానికి ఉపయోగపడాలని కలెక్టర్‌ ప్రసన్న వెంకటేష్‌ అన్నారు. ప్రకృతి వైపరిత్యాల నిర్వహణపై జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ, ఎపిఎస్‌డిఎంఎ, ఎపిఎస్‌ఐఆర్‌ డిపిఆర్‌ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జెవిఆర్‌ నగర్‌లోని సోషల్‌ సర్వీస్‌ సొసైటీ ట్రైనింగ్‌ సెంటర్‌లో నిర్వహించిన ఐదో బ్యాచ్‌ ఆపదమిత్ర వాలంటీర్ల శిక్షణ ముగింపు కార్యక్రమంలో కలెక్టర్‌ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదలు, తుపాన్లు వంటి విపత్తుల సమయంలో ప్రభుత్వం మాత్రమే అన్ని చర్యలు తీసుకోవడం సాధ్యంకాదని ఇందులో ప్రజాభాగస్వామ్యంకూడా ఎంతో అవసరమన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆపదమిత్ర వాలంటీర్ల శిక్షణ చేపట్టామన్నారు. ఈ శిక్షణలో ఆపదమిత్రలకు అందించిన కార్యక్రమాలను ఒకసారి ఆకళింపు చేసుకోవాలన్నారు. విపత్తుల సమయంలో ఆపదమిత్రలు తమ బాధ్యతను పూర్తిస్థాయిలో నిర్వహించి బాధితప్రాంత ప్రజలకు ప్రాణ, ఆస్తినష్టం జరుగకుండా రక్షించాలన్నారు. వీరు అగ్నిమాపక తదితర శాఖలఅధికారులు అందించిన మార్గదర్శకాలకు అనుగుణంగా వారికి అందించిన మెటీరియల్‌ను వినియోగించుకోవడంలో నైపుణ్యం సాధించాలన్నారు. ఏలూరు జిల్లాలోని పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు, కలిదిండి, ఏలూరు, దెందులూరు, గణపవరం, కైకలూరు, నూజివీడు, పెదపాడు, పెంటపాడు, భీమడోలు మండలాల్లోని 251 మంది ఆపద మిత్రలుగా శిక్షణ పొందారన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాలకు శిక్షకులను తీసుకువెళ్లి వాస్తవ పరిస్థితులపై సమగ్రమైన అవగాహన కల్పించడంతో పాటు గ్రామ, పంచాయతీల్లో లభించే సహజ వనరులు, సామాజిక వనరులు, సోషల్‌ మ్యాపింగ్‌, గత విపత్తుల చరిత్ర వంటి పలుఅంశాలపై ఫీల్డ్‌ విజిట్‌ ద్వారా శిక్షణ ఇస్తామన్నారు. జెడ్‌పి సిఇఒ రవికుమార్‌ మాట్లాడుతూ ఈ నెల 19 నుండి 30వ తేదీ వరకు 12 రోజుల పాటు ఐదో బ్యాచ్‌ ఆపదమిత్ర వాలంటీర్లకు శిక్షణ ఇచ్చామన్నారు. అనంతరం శిక్షణపొందిన వారికి సేఫ్టీ కిట్స్‌తో పాటు సర్టిఫికెట్లు కలెక్టర్‌ అందజేశారు.

ప్రజలకు మెరుగైన సేవలు : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు పోలీసులు నిత్యం కృషి చేస్తున్నారని, నిందితుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ చెప్పారు. ఏలూరు పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ఆయా సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులకు ఎస్‌పి ఫోన్ చేసి వాటి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు నకిలీ రుణాల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మీ ఫోన్‌లోని వ్యక్తిగత సమాచారాన్ని సైతం తస్కరించి బ్లాక్‌మెయిల్ చేస్తారన్నారు. నేరాలకు పాల్పడే వ్యక్తుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, శాంతిభద్రత పరిరక్షణలో విఘాతం కలిగిస్తే సహించేది లేదన్నారు.



రెడ్డి శ్రీమన్నారాయణ మృతదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రెడ్డి శ్రీమన్నారాయణ మృతి బాధాకరం

ప్రజాశక్తి - ఏలూరు

సిపిఎం కుమ్మరి రేవు శాఖ సభ్యులు రెడ్డి శ్రీమన్నారాయణ (52) మృతికి నగర కమిటీ సంతాపం తెలిపింది. సోమవారం ఉదయం స్థానిక 29వ డివిజన్ కుమ్మరి రేవులో మృతదేహాన్ని సిపిఎం జిల్లా, నగర నాయకులు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు బి.సోమయ్య మాట్లాడుతూ శ్రీమన్నారాయణ బిల్డింగ్ కార్మికుడిగా పని చేస్తూ అటు సిఐటియు, ఇటు సిపిఎం కార్యకలాపాల్లో పాల్గొనేవారన్నారు. శ్రీమన్నారాయణకు, భార్య, ఒక కుమార్తె ఉన్నారన్నారు. శ్రీమన్నారాయణ మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. శ్రీమన్నారాయణ మృతదేహంపై ఏలూరు కార్యదర్శి పళ్లెం కిషోర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ పార్టీ పతాకాన్ని ఉంచి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి జి.యేసుబాబు, నాయకులు జగన్నాధరావు, మీసాల సత్యం, ఇజ్జడ దుర్గారావు, సుదర్శన్, మాణిక్యాలరావు, శంకర్ పాల్గొన్నారు. రెడ్డి శ్రీమన్నారాయణ మృతికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



వట్టి వసంతకుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి సత్యనారాయణ

ఆక్వా అభివృద్ధికి వసంతకుమార్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

ఆక్వారంగ అభివృద్ధికి మాజీ మంత్రి వట్టి వసంత కుమార్ చేసిన చేసిన సేవలు అభినందనీయమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. మల్కీ మహమ్మద్‌పురంలోని వసంత కుమార్ స్వగృహానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి ఆయన తండ్రి వివిఆర్.పార్థసారధి వటి వసంతకుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. వసంతకుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వసంతకుమార్ కుటుంబ సభ్యులను ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు, కాంగ్రెస్ ప్రముఖులు కనుమూరి బాపిరాజు, బొల్లిశెట్టి శ్రీనివాస్, మాజీ ఎంపీలు కెవిపి.రామచంద్రరావు, లక్ష్మీనారాయణ పరామర్శించారు.

విద్యార్థినికి సైకిల్ అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

దాతల సహకారంతో పట్టణ నాలుగో వార్డు, ఇందిరానగర్ కాలనీలో విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్నామని వారధి ట్రస్ట్ వ్యవస్థాపకులు వలవల తాతాజీ తెలిపారు. వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో దాత బిరుదుగడ్ల సుబ్బారావు వితరణతో ఏడో తరగతి చదువుతున్న తాళ్ల మహేశ్వరికి సైకిల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత వలవల తాతాజీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థినులకు 18 సైకిళ్లు అందించాలనే లక్ష్యం నేటితో యాభై శాతం పూర్తయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.నాగేశ్వరకుమార్, షేక్ పీరూ, పెదవేగి రాంబాబు, శ్రీను, కె.శివ, కిషోర్, వీరబ్రహ్మం, శ్రీను పాల్గొన్నారు.

జియో ఫైబర్ నెట్‌వర్క్ లైన్ పరిశీలన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని రాచన్నగూడెం, పూచికపాడు మధ్యలో జియోఫైబర్ నెట్‌వర్క్ సంస్థకు సంబంధించి అడవి ప్రాంతంలో పైపులైన్ నిమిత్తం జిల్లా ఫారెస్ట్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోనగా సోమవారం జిల్లా అటవీ శాఖ అధికారి రవీంద్రధామా సంబంధిత ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైబర్ నెట్ వర్క్‌కి సంబంధించి అటవీ అభివృద్ధి సంపదకు నష్టం కలగకుండా పైపులైన్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. అనంతరం రేంజ్ పరిధి లోని ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ఆయనతో పాటు సబ్ డివిజనల్ అటవీ శాఖ అధికారి సౌజన్య, ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీవాణి, సెక్షన్ అధికారి దినేష్ పాల్గొన్నారు.

3న ఎపి రైతు సంఘం జిల్లా సమావేశాలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు జంక్షన్‌లోని ఒక ప్రయివేట్ కళ్యాణ మండపంలో ఫిబ్రవరి మూడో తేదీన ఎపి రైతు సంఘం జిల్లా సమావేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు భీమడోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో సమావేశపు కరపత్రాలను సీనియర్ నాయకులు జి.ప్రసాదరావు, జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, కౌలు రైతుల సంఘ నాయకులు వెజ్జు శ్రీరామ చంద్రమూర్తి, పొన్నం మురళీకృష్ణతో కలిసి ఆయన సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఎపి రైతుల సంఘ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు.

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా పవన్

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు పట్టణానికి చెందిన గోళ్ల ఫణి (పవన్) యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఈ మేరకు జాతీయ యూత్ కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీ కృష్ణ ఆళ్వార్ నుంచి సోమవారం ఉత్తర్వులు అందాయి. గతంలో పవన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మచిలీపట్నం పార్లమెంట్ ప్రెసిడెంట్‌గా యూత్ కాంగ్రెస్‌లో విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఇంత గొప్ప అవకాశం ఇచ్చిన పార్టీకి, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. పవన్‌ను కాంగ్రెస్ నూజివీడు ఇన్‌ఛార్జి బిడి.రవికుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సాగర్, పిసిసి సెక్రటరీ విఠల్ అభినందించారు.

మహిళలకు కుట్టు మిషన్లు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని విద్యా రోహిణి హై స్కూల్‌లో 2022 జూన్ నెల నుంచి ఉచిత కుట్టు మిషన్ శిక్షణ శిబిరాన్ని తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఆరు నెలలు శిక్షణ పొందిన మహిళలకు తపనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తపన చౌదరి ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళ తన కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు కల్పించడంలో ఈ కుట్టు మిషన్లు ఉపయోగపడతాయన్నారు.

గురుకుల పాఠశాలకు విద్యాసామగ్రి

ప్రజాశక్తి - చింతలపూడి

పట్టణంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలకు నాడు నేడు ద్వారా రూ.20 లక్షల విలువైన విద్యాసామగ్రి వచ్చినట్లు ప్రిన్సిపల్ రామకృష్ణ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

గాంధీ ఆశయాలు అనుసరణీయం

పలుచోట్ల వర్థంతి సభలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మహాత్మాగాంధీ వర్థంతి సందర్భంగా సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గెడ్డం ఎలీషా ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ కెఎం.మంగతాయారు ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒలు, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి :పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మహాత్మా గాంధీ వర్థంతి కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు మాటూరి చక్రధరరావు అధ్యక్షతన నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విజయానంద్ మాస్టార్ గాంధీ ఆశయాలను ప్రబోధించే పాటను చక్కగా ఆలపించారు. సుజాత టీచర్ చక్కటి సందేశాత్మక కవితను వినిపించారు. విద్యార్థులు గాంధీ జీవిత చరిత్ర వివరించారు.

దెందులూరు : దేశ చరిత్రలో మహాత్మా గాంధీ సేవలు చిరస్మరణీయమని మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి ఎబివిపి.లక్ష్మి అన్నారు. మహాత్మాగాంధీ వర్థంతి సందర్భంగా ఎంపిడిఒ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శర్మ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పలు చోట్ల గాంధీ వర్థంతి కార్యక్రమం నిర్వహించారు.

నూజివీడు : నూజివీడు నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో గాంధీ వర్థంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, నూజివీడు నియోజకవర్గ పరిశీలకులు బొడ్డు వేణుగోపాలరావు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్నా స్వరాజ్యం నేడు రాష్ట్రంలో ఫ్యాక్షన్ నాయకుల చేతుల్లోకి వెళ్లిందన్నారు. ప్రజా రక్షణ కల్పించాల్సిన వ్యవస్థలు ఒక పార్టీకి ప్రయివేట్ సైన్యంలా వ్యవహరిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

జీలుగుమిల్లిలో...

ఈ కార్యక్రమంలో ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు గాజుల రాజేష్, టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తట్టి అచ్యుత్, నియోజకవర్గ అధ్యక్షులు శివనాగరాజు పాల్గొన్నారు.

ముసునూరు : మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ వర్థంతి సభను ఎంపిడిఒ జి.రాణి, ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, ఎఒ బసవరాజు, కూచిపూడి సాయిరాము నిర్వహించారు. మండలంలోని లోపూడి ఆశ్చర్య పాఠశాలలో జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, ముసునూరు మండపం సెంటర్‌లో గ్రామస్తుల ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అచ్చమ్మ పేరంటాల జాతరలో జబర్దస్త్ టీమ్ సందడి

ప్రజాశక్తి - దెందులూరు

మండలంలోని గాలాయగూడెం గ్రామంలోని శ్రీఆచ్చమ్మతల్లి ఉత్సవాలు సందర్భంగా అమ్మవారిని బిజెపి రాష్ట్ర నాయకులు, తపన సంస్థల ఛైర్మన్ గారపాటి రామాంజనేయచౌదరి, కాపు, బలిజా సంఘంల జెఎసి ఛైర్మన్ దాసరి రాము సోమవారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సినీ మ్యూజికల్ నైట్ సందర్భంగా జబర్దస్త్ టీం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హాస్య సీనియర్ నటులు బుల్లెట్ భాస్కర్, సునామి సుధాకర్, నరేష్, తన్మయి ఆలయానికి వచ్చిన భక్తులను వారి హాస్య చతురతతో కడుపుబ్బ నవ్వించారు. సుమారు ఐదు వేల మంది అమ్మవారిని దర్శిం చుకున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఒకటో తేదీన అచ్చమ్మ తల్లి ఆలయ ఆవరణలో వంద మంది దంపతులు సాము హిక సత్యనారాయణ వ్రతం చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేయ డంతో పాటు దెందులూరు ఎస్ఐ వీర్రాజు ఎలాంటి అవాంఛిత సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు.



మాట్లాడుతున్న రాజేశ్వరి

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి పడమర వీధి గాంధీ మైదానంలో సోమవారం చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో మహిళలపై బాలబాలికలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, అప్రమత్తంగా మెలగాలని సూచించారు. బాధితులకు పోక్సో చట్టం ద్వారా రక్షణ కల్పిస్తారని, ఎవరైనా బాధితులు ఉంటే పరిహారం పొందడం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఫిబ్రవరి 11వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందించే ఉచిత న్యాయ సేవలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ శామ్యూల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లాలోని జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో పని చేస్తున్నామని, ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యంగా పని చేస్తామని జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ చెప్పారు. ఏలూరులోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో రోడ్‌సేఫ్టీ మొబైల్ సిబ్బందితో సోమవారం రోడ్డు ప్రమాదాల నివారణపై సమీక్షించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ జాతీయ రహదారులపై పనిచేస్తున్న రోడ్డు సేఫ్టీ మొబైల్ సిబ్బంది స్వీయ రక్షణ చేసుకుంటూ ప్రజల ప్రాణ రక్షణకు పాటుపడాలని చెప్పారు. హైవే సేఫ్టీ మొబైల్ సిబ్బంది వారికి నిర్దేశించిన ప్రదేశాల్లో తరచూ తనిఖీలు చేయాలని, జాతీయ రహదారుల్లోని దాబాలను రాత్రి 10.30 గంటలకు మూయించివేయాలని చెప్పారు. రాత్రి వేళల్లో విధిగా ఫేస్ వాష్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. జాతీయ రహదారుల్లో పనిచేస్తున్న సేఫ్టీ మొబైల్ సిబ్బంది అలసత్వం, నిర్లక్ష్యం, అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. జాతీయ రహదారుల్లో రాంగ్ రూట్‌లో ఎదురుగా వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి జరిగే రోడ్డు ప్రమాదాలపై కారణాలను నిశితంగా విశ్లేషణ చేస్తామని ఎస్‌పి చెప్పారు. ఈ సమీక్షలో డిటిఆర్‌టి ఎస్ఐ కె.రాంబాబు, నేషనల్ హైవే సేఫ్టీ మొబైల్ సిబ్బంది ఉన్నారు.

గురుకుల పాఠశాలను అభివృద్ధి చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రభుత్వాలు మారినా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాల అభివృద్ధి జరగడంలేదని సిపిఎం ఏరియా కన్వీనర్ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. పట్టణంలో గురుకుల పాఠశాలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్.అంబేద్కర్ గురుకులంలో 650 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. వీరందరు రేకుల షెడ్డులో ఉంటున్నారని, పాఠశాల తరగతి గదులు, వసతులు లేవని చెప్పారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎండాకాలంలో అమితమైన వేడితో విద్యార్థులు ఉక్కిరిబిక్కిరవుతున్నారన్నారు. ప్రభుత్వాలకు, ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి లేదన్నారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన భవనాలు శిథిలావస్థకు

పాఠశాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

చేరుకుంటున్నాయన్నారు. నిర్మాణంలో ఆగిపోయిన గురుకుల పాఠశాల భవనాలను పూర్తిచేయాలని కోరారు. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించకపోతే ప్రజాసంఘాలను కలుపుకొని ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. పాఠశాలలో చదివే ఎస్‌సి పేద విద్యార్థులేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవగురు, సత్తిబాబు పాల్గొన్నారు.

మాజీ ఎంఎల్‌ఎ కారును ఢీ కొట్టిన బొలెరో

డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

మాజీ ఎంఎల్‌ఎ, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయమంగళ వెంకటరమణకు ప్రమాదం తప్పింది. సోమవారం వ్యక్తిగత పనిపై కారులో భీమవరం వెళ్లి తిరిగి కైకలూరు బయలుదేరారు. ఈ క్రమంలో ఉప్పుటేరు వద్దకు వచ్చేసరికి బొలెరో వాహనం ఢీ కొట్టింది. డ్రైవర్

కారులో జయమంగళ

అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. కారు ముందు భాగం ధ్వంసమైంది. ఢీ కొట్టిన బొలెరో వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. ఎవ్వరో కావాలనే ఇలా చేసి ఉంటారని జయమంగళ ఆరోపించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి సీసీటీవీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

పెరిగిన గుండె వేగం

ప్రమాద సంఘటనతో జయమంగళ వెంకటరమణ గుండె కొట్టుకునే వేగం పెరిగింది. దీంతో ఆయన వ్యక్తిగత సహాయకుడు జ యమంగళను కైకలూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు చేసి పలు సూచనలు చేసినట్లు ఆయన మిత్రుడు బలే ఏసురాజు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నగర పంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌కు సోమవారం స్పందన కార్యక్రమంలో ఐటిడిపి నియోజకవర్గ కన్వీనర్ బోడా అవినాష్, టిడిపి నాయకులు మారుమూడి థామస్ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చింతలపూడి పాత బస్టాండ్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కావూరి బస్సుషెల్టర్‌ను వాడుకలోకి తీసుకురావాలని, బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ పక్కనే ఉన్న స్థలంలోనే మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. చింతలపూడిలో సెంట్రల్ లైటింగ్ వెలగక రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొని ప్రమాదానికి గురవుతున్నారన్నారు. సెంట్రల్ లైటింగ్ వెలిగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. చింతలపూడి నుంచి విజయవాడకు ఎక్స్‌ప్రెస్ సర్వీసు లేకపోవడంతో గర్భిణులు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రోగుల అవసరాన్ని ఆసరాగా తీసుకుని ప్రయివేట్ నిర్వాహకులు పేదలను దోచుకుంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం డిపో రీజనల్ మేనేజర్ సూపరింటెండెంట్‌కి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్‌కుమార్, నియోజకవర్గ నాయకులు మారుమూడి థామస్ పాల్గొన్నారు.

వైద్యరంగంపై ప్రత్యేక దృష్టి

రోగులతో మాట్లాడుతున్న ఎంపిపి సత్యనారాయణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

వైద్యరంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని దేవపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి పనులపై డాక్టర్లతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు మెరుగైన సౌకర్యాల అందించాలన్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు తత్తెతకుండా చూడాలన్నారు. వైద్య సిబ్బంది విధులు పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. సిబ్బంది తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే వారిపై శాఖపసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమయపాలన పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పి.మల్లీశ్వరి, వైద్యులు వినయ్, మధుసూదనరావు, ఎల్‌టివి.వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనపై శిక్షణాతరగతులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

స్థానిక ఐకెపి మండల సమైక్య కార్యాలయంలో సోమవారం గ్రామ సంఘం లీడర్లకు పేదరిక నిర్మూలన అంశంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐకెపి ఎపిఎం పద్మావతి మాట్లాడుతూ పేదరిక నిర్మూలన కోసం వెలుగు ఐకెపి ద్వారా ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలో చెప్పారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న మౌలిక వసతులను ఉపయోగించుకుని ప్రభుత్వం సంఘాల ద్వారా ఇస్తున్న ఆర్థిక సాయంతో ఏ విధంగా అభివృద్ధి చెందాలో ఆమె తెలిపారు. శ్రీ నిధి, బ్యాంకు రికవరీ తదితర విషయాల్లో గ్రూపు లీడర్లు తమ గ్రూపులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ శిక్షణ తరగతులకు గ్రామ సంఘం లీడర్లు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐకెపి సిబ్బంది గ్రామ సంఘ లీడర్లు పాల్గొన్నారు.

ఇ-క్రాప్, ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని రైతులందరూ ఇ-క్రాప్, ఇ-కెవైసి నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారి బి.శివశంకర్ తెలిపారు. మండలంలోని కోటపాడు గ్రామంలో రబీ సీజన్‌లో సాగు చేస్తున్న పంట పొలాలను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులు పండిస్తున్న పంట వివరాలను గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో పంట నమోదు ఫిబ్రవరి పదో తేదీ లోపు చేయించుకోవాలని తెలిపారు.

కుష్టు నిర్మూలనకు పాటు పడాలి

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మహాత్మా గాంధీ వర్థంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భీమడోలు సర్పంచి సునీతమాన్‌సింగ్, పోలసానిపల్లి సర్పంచి రహిమా బేగం హసేన మాట్లాడుతూ గాంధీ ఆశయాలకు కట్టుబడి ఉందామన్నారు. కుష్టు వ్యాధి తో పోరాడుదాం - గత చరిత్రగా మారుద్దాం అనే నినాదం తో ప్రభుత్వ పిలుపు మేరకు ఈ నెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు నిర్వహించే స్పర్శ కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమాన్ని భీమ డోలు సర్పంచుల ఛాంబర్ అధ్యక్షు రాలు సునీత మాన్‌సింగ్ భీమడో లులో ప్రారంభిం చారు. పోల సానిప ల్లిలో నిర్వహించిన కార్యక్ర మంలో భాగంగా సర్పంచి స్పర్శ ప్రతిజ్ఞ చేయించారు.

చాట్రాయి :చాట్రాయి పిహెచ్‌సి డాక్టర్. కె.లీనాబెంజిమెన్ ఆధ్వర్యంలో సోమవారం కుష్టువ్యాధిపై అవగాహన సదస్సులు నిర్వహించారు. చాట్రాయి గ్రామ సచివాలయంలో నిర్వహించిన సదస్సులో సర్పంచి దామెర ఉష మాట్లాడుతూ శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు ఉంటే వెంటనే అందుబాటులో ఉన్న వైద్యులను సంప్రదించి నిర్ధారణచేయించుకోవా లన్నారు. కుష్టు వ్యాధికి సంబంధించిన మచ్చలైతే తగిన మందులు వాడి వ్యాధిని నిర్మూలించుకోవాలన్నారు. అనంతరం గాంధీ వర్థంతి సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోటపాడు, నరసింహారావుపాలెం, చనుబండ, ఆరుగొలనుపేట, తుమ్మగూడెం అన్ని గ్రామ పంచాయతీ గ్రామ సచివాలయాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమణ, హెల్త్ సూపర్‌వైజర్ జయలక్ష్మి, గ్రామ సర్పంచులు విస్సంపల్లి జ్యోతి, పుచ్చకాయల అప్పిరెడ్డి, విస్సంపల్లి ప్రశాంతి, పరస

భీమడోలులో...

సత్యనారాయణ, మారెమ్మ, ఎంపిటిసి సభ్యులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, అంగనవాడీ కార్యకర్తలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముసునూరు :ముసునూరు, రమణక్కపేట పిహెచ్‌సిల్లో కుష్టు వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని వైద్యులు ఎండి.కరిముల్లా, ఎం,కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని ఐదు గ్రామ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న ఏడు వాలంటీర్ల పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎంపిడిఒ కెఎం.మంగతాయారు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఫిబ్రవరి ఐదో తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జీలుగుమిల్లిలో ఒకటి, దర్భగూడెంలో మూడు, కామయ్యపాలెంలో ఒకటి, తాటియాకులగూడెంలో ఒకటి, అంకన్నగూడెంలో ఒకటి మొత్తం ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

భీమడోలు : మండల పరిధిలోని నాలుగు గ్రామపంచాయతీల్లో ఖాళీగా ఉన్న ఏడు గ్రామ వాలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపిడిఒ రాఘవన్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఫిబ్రవరి ఐదో తేదీ లోగా యుఆర్‌ఎల్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పోస్టుల ఎంపికకు ఈ నెల ఏడో తేదీన మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు.

ముదినేపల్లి : మండలంలోని పెదగొన్నూరు, వడాలి, ముదినేపల్లి గ్రామాల్లో ఖాళీగా ఉన్న మూడు గ్రామ వాలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపిడిఒ పి.మల్లీశ్వరి సోమవారం తెలిపారు. వాలంటీర్ల పోస్టులకు ఆన్‌లైన్ ద్వారా ఫిబ్రవరి ఐదో తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

జోడో యాత్ర విజయవంతంపై హర్షం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు రాహూల్ గాంధీ చేపట్టిన జోడో యాత్ర విజయవంతంగా ముగిసిందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు జెట్టి గురునాధరావు అన్నారు. సోమవారం ఎఐసిసి - పిసిసి పిలుపు మేరకు కాంగ్రెస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జెట్టి గురునాధరావు పార్టీ కార్యాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెట్టి గురునాధరావు మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర దేశవ్యాప్తంగా ప్రజలందరిని సమైక్యపరిచిందన్నారు. నేటి బిజెపి ప్రభుత్వం దేశాన్ని విచ్ఛిన్నం చేయటం కోసం కుల, మత, వర్గ ప్రాంతాలుగా విడదీసి ప్రజల్లో సమస్యాత్మక చర్యలు చేపట్టిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ దేశ సమైక్యత కోసం భారత పౌరులను సమైక్యపరిచి, జాతీయతభావం పెంపొందింపచేయడానికి జోడో యాత్ర దోహదపడిందని జెట్టి గురునాధరావు అన్నారు. నేటితో రాహుల్ గాంధీ చేపట్టిన జోడో పాదయాత్ర ముగుస్తున్న సందర్భంగా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరించి మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ముప్పిడి శ్రీనివాసరావు, చిన్ని రామసత్యనారాయణ, హీరాహకీమ్, బి.ప్రసాద్, వీరవల్లి సోమేశ్వరరావు, తాడేపల్లి ఉమాదేవి, పిండి రాము, ఆర్.ఆదినారాయణ, మొగిలినీడి శ్యామ్, కొల్లి రామసూరిరెడ్డి, రామారావు, మద్దిపాటి శ్రీను, మామిడి రాము, ఏలూరి ఫణికుమార్ పాల్గొన్నారు.

'టిడిపి గెలుపునకు కృషి చేయాలి'

ప్రజాశక్తి - నూజివీడు

వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నూజివీడు నియోజకవర్గ పరిశీలకులు బొడ్డు వేణుగోపాలరావు, నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఐ టిడిపి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యాత్రను చూసి వైసిపిలో వణుకు ప్రారంభమైందన్నారు. దీంతో టిడిపిపై మరింత దుష్ప్రచారం చేసేందుకు వైసిపి సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలను సైతం సాగిస్తుందన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే తమ ప్రజలకు ఏం చేస్తామో తెలుపుతూ పోస్టులను పెట్టాలన్నారు. ఆధునిక యుగంలో ప్రపంచమే ఉక్కు గ్రామంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా ప్రాధాన్యత ఎంతైనా ఉందన్నారు. వేణుగోపాలరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇన్‌ఛార్జిలే ఎంఎల్‌ఎలుగా పోటీ చేస్తారని, ఈ నేపథ్యంలో నూజివీడు నియోజకవర్గంలో ఇన్‌ఛార్జికి ప్రతి కార్యకర్త అండగా నిలిచి వారి గెలుపునకు కృషి చేయాలన్నారు.

మహారాజశ్రీ 1వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 317/2021

బిట్వీన్:
బ్యాంక్ ఆఫ్ బరోడా, Rep. by its మేనేజర్, తణుకు. ...వాది

మరియు

1) పితాని గాంధీ, తండ్రి: వెంకన్న, 24-15-12, శంభునిపేట, పాలకొల్లు.
2) కట్టా మురళీ, తండ్రి: వెంకటేశ్వరరావు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
...ప్రతివాదులు

ప్రకటన

పై నెంబరు గ్రంథములో ప్రతివాదులు అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు కట్టినప్పటికినిన్ని అమలు జరుగనందున శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ఉత్తర్వులు జారీ చేసియున్నారు. సదరు గ్రంథము **ది.10-02-2023వ తేదీ వాయిదా అయి ఉన్నది. కావున మీరిద్దరూ సదరు తేదీన శ్రీ కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10::30 ని॥లకు హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు మీరు స్వయంగా గాని లేక మీయొక్క ప్లీడరు గారి ద్వారా గాని తెలుపుకోవలెను.** లేనిచో సదరు గ్రంథము మీ యొక్క పరోక్షములో తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

తణుకు, **ఓ.ఎన్.కృష్ణ**
30-1-23. అడ్వకేట్, తణుకు.